క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ



సాధించిన పతకం, షీల్డ్‌తో జయశ్రీ

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో రెండో సంవత్సరం బైపీసీ చదువుతున్న బీర జయశ్రీ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కవల కోటిలింగం తెలిపారు. ఏపీ అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ బాలికల టీమ్‌కు ఎంపికైన జయశ్రీ గత నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ మూడు రోజులపాటు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో ఉమ్మడి జిల్లా టీమ్ తరఫున పాల్గొని సత్తా చాటింది. ఈ పోటీల్లో జిల్లా టీమ్ తృతీయ స్థానం సాధించిందని తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో జయశ్రీని డీవీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు ప్రశంసించారు.

దీపావళి జాగ్రత్తలపై అవగాహన

అమలాపురం టౌన్: దీపావళి పండగను అత్యంత జాగ్రత్తగా జరుపుకోవాలని సూచిస్తూ స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఉపాధ్యాయులు శుక్రవారం అవగాహన కల్పించారు. టపాసుల కాల్చేటప్పుడు కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలని, మట్టి ప్రమిదల్లోనే దీపాలు వెలిగించాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.గౌరీశంకర్ ఆధ్వర్యంలో దీపాలు వెలిగించి టపాసులు కాల్చారు.

దీపావళిపై సదస్సులు, ర్యాలీలు

అమలాపురం టౌన్: స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 సౌజన్యంతో అమలాపురం మున్సిపాలిటీలో శుక్రవారం పలుచోట్ల 'స్వచ్ఛ దీపావళి- శుభ దీపావళి' నినాదంతో ఆ పండగను ఎంత స్వచ్ఛంగా జరుపుకోవాలో వివరిస్తూ అవగాహన సదస్సులు, ర్యాలీలు జరిగాయి. గడియారం స్తంభం సెంటరులో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, పట్టణ సీఐ టి.క్రాంతికుమార్, మున్సిపల్ ఇంజినీర్లు పాల్గొని విద్యార్థలతో స్వచ్ఛ దీపావళి ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. మట్టి ప్రమిదలు ప్రదర్శించి వాటితోనే దీపాలు వెలిగించుకోవాలని సూచించారు. గొవ్వాల వారి వీధిలో ఆ ప్రాంత గృహిణిలతో అవగాహన సదస్సు ఏర్పాటుచేసి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని 15 వార్డు సచివాలయాల పర్యావరణం, పారిశుద్ధ్యం కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్

ముమ్మిడివరం: సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని ముమ్మిడివరం మండలంలోని విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి డి.హనుమంతరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు జనిపెల్ల సత్యనారాయణ, కన్వీనర్ ఎం.అబ్బులు ఆధ్వర్యంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ నెల 28వ తేదీ వరకు సైంటిఫిక్ టెంపర్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

యానాం: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోనల్ గేమ్స్‌లో భాగంగా శుక్రవారం కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ హైస్కూల్ క్రీడామైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ కళాశాల జట్టు ప్రథమ, రీజెన్సీ జూనియర్ కళాశాల జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించాయి. ఈ పోటీలకు ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ హాజరై విజేతలను అభినందించారు. బేతాళం కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వయో పరిమితి పెంచాలని వినతి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ రిక్రూట్‌మెంట్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అభ్యర్థుల వయోపరిమితిని పెంచాలని శుక్రవారం 17 ప్రజాసంఘాలు సీఎం రంగసామి, మంత్రి లక్ష్మీనారాయణ, స్పీకర్ సెల్వంకు వినతిపత్రం అందజేశాయి. బీసీ, ఎంబీసీ, ముస్లిం మైనారిటీలు, వితంతువులకు వయోపరిమితి 40 ఏళ్లకు పెంచాలని కోరాయి.

ఉపాధ్యాయుల తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

తాళ్లరేవు: నీలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, దండించడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక పాఠశాలలో హెచ్‌ఎం రాధాకృష్ణ అధ్యక్షతన తల్లిదండ్రులు, స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల గణితం బోధించే ఉపాధ్యాయుడు విద్యార్థులను దండించడం వల్ల విద్యార్థులు పాఠశాలకు రావడానికి భయపడుతున్నారని పలువురు తల్లిదండ్రులు అన్నారు. మధ్యాహ్న భోజనంలో పురుగులు ఉండడంతో విద్యార్థులు ఇంటికి వచ్చి భోజనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌ఎం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడి పరిశుభ్రమైన భోజనం విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. నాయకులు చిట్టూరి కలికిమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు దంగేటి సూరిబాబు, పిల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

14న హిందూ ధర్మ ప్రచారం

ఐ.పోలవరం: మండలంలో గుత్తినదీవి గ్రామంలో ఈ నెల 14న మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి దేవస్థానం తరఫున హిందూ ధర్మప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు.

జనం ముంగిటకే వైద్యం

- పేదలకు ఉపయోగంగా జగనన్న ఆరోగ్య సురక్ష
- 80 శిబిరాల్లో 33,337 మందికి వైద్య సేవలు
- 8,563 మందికి కంటి వెలుగు పరీక్షలు
- 730 మంది ఆరోగ్య శ్రీ పథకానికి సిఫారసు



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అల్లవరం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులకు మెరుగైన సేవలు అందాయి. సుమారు నెల రోజుల పాటు జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడింది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులను మెరుగైన చికిత్స కోసం ఉన్నత సౌకర్యాలు ఉన్న ఆస్పత్రులకు రిఫర్ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ఏడు రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. జనరల్ మెడిసన్, జనరల్ సర్జన్, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, కంటి విభాగాలకు చెందిన డాక్టర్లు ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్య సేవలు అందించారు.

మండలం	జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు	ఓపీ	కంటి వెలుగు ఓపీ	ఆరోగ్యశ్రీకి రిఫర్ చేసిన రోగులు
అల్లవరం	22	10,409	3,690	292
ఉప్పలగుప్తం	19	7,178	1,548	175
అమలాపురం అర్బన్	12	3,794	236	68
అమలాపురం రూరల్	27	11,956	3,089	195

ఉచితంగా మందులు

అమలాపురం నియోజకవర్గ పరిధిలో 80 జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 33,337 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. 8,563 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 730 మందికి ఉన్నత వైద్యం అవసరమని గుర్తించి మెరుగైన చికిత్సకు ఆరోగ్య శ్రీ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చిన ప్రతి రోగికి డాక్టర్లు సూచించిన మందులను ఉచితంగా అందించారు. అల్లవరం మండలంలోని దేవగుప్తం సచివాలయంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో 842 మందికి వైద్య సేవలు అందించడంతో జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని దీని వల్ల తమకు ఎంతో మేలు జరుగుతుందని ఆనందం వ్యక్తం చేశారు. వలంటీర్లు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, అధికారులు ప్రజల పట్ల ఎంతో నిబద్ధతతో సేవలు అందించారు.

ఎంతో ఉపయోగం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి 15 రోజులు ముందే మా ఇంటికి వచ్చి బీపీ, సుగరుతో పాటు రక్త పరీక్షలు చేసి వైద్య శిబిరానికి రమ్మని కూపన్ ఇచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో నాకు పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. ఈ విధానం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది.

–మహమ్మద్ ఉన్నీసాబేగం, అల్లవరం

ఇంటి వద్దనే సేవలు



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారింది. పేదలకు వైద్య పరంగా ఎన్నో సేవలందిస్తున్నారు. ఇంటింటికీ వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రికి వెళ్లే అవసరం లేకుండానే ఇంటి వద్దనే సేవలందిస్తున్నారు.

– బీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్, ఎంపీడీఓ, నోడల్ అధికారి అల్లవరం

15 రోజుల ముందే సర్వే



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి 15 రోజుల ముందు వలంటీర్ల ద్వారా సర్వే నిర్వహించాం. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలను లబ్ధిదారుల ఇళ్లకు పంపించి రక్త పరీక్షలు, బీపీ, సుగర్ వంటి పరీక్షలు నిర్వహించాం. శిబిరాల్లో ఐదు విభాగాల డాక్టర్లు సేవలు అందించారు. వైద్య సిబ్బంది, ఆశాల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాం.

– డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, బెండమూర్లంక పీహెచ్‌సీ, అల్లవరం

సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం



మెట్ల కాలనీలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బులినాని, వలంటీర్లు, గృహ సారథులు



జి.వేమవరంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కన్వీనర్ వెంకటపతిరాజు

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాలు పట్టణంలోని మెట్ల కాలనీ, ఒంటిద్దు వారి వీధి వార్డు సచివాలయాల పరిధిలో రెండో రోజు శుక్రవారం చైతన్యవంతంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో నాలుగున్నరేళ్లుగా అమలవుతున్న పలు సంక్షేమ పథకాలు, ప్రతి కుటుంబానికి అందుతున్న లబ్ధిని పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పట్టణ గృహ సారథుల కన్వీనర్ ఈతకోట శ్రావణ్‌కుమార్, పార్టీ నాయకులు సుంకర సుధ, నల్లా ప్రసాద్‌తో పాటు ఆయా ప్రాంతాల వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి జగనన్న చేస్తున్న మేలును గణాంకాలతో పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీల జాబితా పత్రాన్ని చూపించి ఇప్పుడు జగన్ ఇచ్చిన హామీలు, అమలవుతున్న పథకాలు పత్రాన్ని చూపించి రెండింటి మధ్య వ్యత్యాసాన్ని గమనించాలని ఆయా కుటుంబాలకు వివరించారు. వంటిద్దు వారి వీధి సచివాలయం వద్ద జరిగిన జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు, జనసేన నాయకుడైన యేడిద శ్రీను, టీడీపీకి చెందిన మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబుతో పాటు ఆ రెండు ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు నాయకులు పాల్గొనడం గమనార్హం. నాలుగున్నరేళ్లలో ఆ సచివాలయ పరిధిలో కుటుంబాలకు అందించిన సంక్షేమ జాబితా డిస్‌ప్లే బోర్డును వారు పరిశీలించారు.

నాలుగున్నరేళ్లలో 98శాతం హామీల అమలు

ఐ.పోలవరం: నాలుగున్నరేళ్లలో 98 శాతం హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి ప్రజల సంక్షేమానికి పాటుపడ్డారని మండల పార్టీ వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని జి.వేమవరం సచివాలయం-1 ఆవరణలో 'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే...' కార్యక్రమం సర్పంచ్ నల్లా సుదర్శన్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పిన్నమరాజు వెంకటపతిరాజు, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సత్యనారాయణరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. నవరత్న పథకాల ద్వారా ఇచ్చిన ప్రతీ ఒక్క హామీని అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి వస్తేనే పేద ప్రజలు సుఖసంతోషాలతో ఉండగలరని పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో కరోనా సమయంలో కూడా ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలను యథావిధిగా అమలు చేశారన్నారు. అమ్మ ఒడి, చేయూత, వాహనమిత్ర, రుణమాఫీ వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ద్వారా పేద ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవిశ్రాంతంగా శ్రమించారన్నారు.

గతంలో పార్టీ మేనిఫెస్టోను సైతం వెబ్‌సైట్ నుంచి తొలగించిన చంద్రబాబు ఇప్పుడు మరోసారి దొంగ హామీలతో వస్తున్నారన్నారు. సొసైటీ అధ్యక్షుడు మెండ వెంకన్నబాబు, వైస్ ప్రెసిడెంట్ పెనుమాళ్ల చంద్రశేఖర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెట్ల సతీష్, ఎంపీటీసీ సభ్యుడు చోడిశెట్టి సత్తినాయుడు, కొండేపూడి నాగేశ్వరావు, కొట్నాల కుమార్, పెరుమాళ్ళ నాగేశ్వరావు, పెరుమాళ్ళ సుబ్బారావు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు అభినందనీయం



సత్కారం పొందిన వైద్యులతో కలెక్టర్ శుక్లా, డీఆర్వో సత్తిబాబు

అమలాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కిమ్స్ వైద్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరఫున ప్రైవేట్ వైద్యులు అందించిన సేవలు అమూల్యమైనవని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ కిమ్స్ వైద్యులను, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరఫున వైద్య సేవలు అందించిన వైద్యులను సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రైవేట్ రంగంలో వైద్యులు ముందుకు వచ్చి సమాజ సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించడం హర్షణీయమని పేర్కొన్నారు. కిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనందాచారి, కంటి వైద్య విభాగం హెడ్ డాక్టర్ ఎ.వెంకట సతీష్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఎస్ఎన్ మూర్తి, కార్యదర్శి డాక్టర్ కడలి సత్య ప్రసాద్‌ను కలెక్టర్ సన్మానించారు. డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర పాల్గొన్నారు.

జగనన్నే మా నమ్మకం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: నాలుగున్నరేళ్ల కాలంగా అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి లబ్ధిదారుడుకి నేరుగా సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని, అందుకే ఏపీకి జగనన్నే కావాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. ఎస్.పల్లిపాలెంలో సర్పంచ్ కొల్లు వెంకటరమణ అధ్యక్షతన ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎస్.పల్లిపాలెం గ్రామానికి వివిధ పథకాలు ద్వారా రూ.9.19 కోట్లు లబ్ధిదారులకు అందించారని తెలిపారు. రూ.1.31 కోట్లతో అభివృద్ధి పనులు చేశారన్నారు. అనంతరం సంక్షేమ బోర్డుని ఆవిష్కరించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ వడ్డి గంగ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, సుందరనీడి సాయి, ఎంపీటీసీ కర్రి సత్య, మాకే కృష్ణమూర్తి, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్లు ఈతకోట సతీష్, యూత్ అధ్యక్షుడు బళ్ల శ్యామ్, గుంటూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్నట్టుగా సంక్షేమ పాలన సాగాలంటే మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తం సచివాలయం 1 పరిధిలో కార్యకర్తలతో ఏపీ వై నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ సంక్షేమాల రూపాయంలో ఒక్క ఉప్పలగుప్తం సచివాలయం 1 పరిధిలో రూ. 22,90,91,724 లబ్ధి చేకూరిందని వివరించారు. అనంతరం గ్రామానికి చేకూరిన లబ్ధి పోస్టర్‌ను జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఉప సర్పంచ్ మోకా శ్రీను, జేసీఎస్ కన్వీనర్ కోటుంలోవరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అడబాల మాధవ, ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు యనమదల పల్లంరాజు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, పార్టీ నాయకులు మోటూరి సత్యంకావు, చిక్కం బాల సుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్‌డి కె.ఎస్.గౌరీకుమారి పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించాలి

అమలాపురం రూరల్: లబ్ధిదారుడుకి నేరుగా సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేని, మళ్లీ సీఎంగా ఆయనను గెలిపించాలని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డొలమణి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్ అన్నారు. ఇందుపల్లిలో ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఈవోపీఆర్డీ గుబ్బల మల్లికార్జునరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు కుడుపూడి నాగరాజు, బొక్క నరసింహమూర్తి పాల్గొన్నారు.

వందరోజులు కష్టపడితే మళ్లీ అధికారంలో ఉంటాం

ఎమ్మెల్యే పొన్నాడ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో వందరోజులు కష్ట పడి పనిచేస్తే మళ్లీ తిరిగి అధికారమనే గొడుగులోకి వస్తామని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల పార్టీ కన్వీనర్ జగతా పద్మనాభం అధ్యక్షతన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఇంతవరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుని ఖాతాలో జమ చేశామన్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నామని అయితే ఏ స్వార్థం లేకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేశారని , ఏఒక్కరూ తన వద్దకు వ్యక్తి గత పనులకు రాకుండా కేవలం ప్రజా సమస్యలపై వచ్చారన్నారు. నియోజకవర్గంలో గడపగడపకూ డిసెంబర్ నెల వరకు జరుగుతుందన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో కోట్లాది రూపాయలు ఖర్చు చేశామన్నారు. ఏపీకి జగనన్నే సీఎం ఎందుకు కావాలిఅనే కార్యక్రమంలో ఆయా గ్రామాలలో మండల స్థాయి నాయకులు రాత్రి నిద్ర చేయాలన్నారు. ఆయా గ్రామాలలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధిని వివరించాలన్నారు. పార్టీ నాయకులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శివశంకరావు, కోలా బాబ్జీ, హితకారిణి సమాజం చైర్మన్ కాశి బాలమునికుమారి, బొంతు సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

పీస్ పోస్టర్ కాంటెస్ట్



తాము గీసిన శాంతి చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: శాంతిని ప్రతిబింబించేలా విద్యార్థులు పీస్ పోస్టర్ కాంటెస్ట్ పేరుతో చిత్రలేఖనం ద్వారా తమ ఆలోచనలను ఆవిష్కరించారు. స్థానిక లయన్స్ క్లబ్, శ్రీ వాగ్దేవి లియో లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం స్థానిక శ్రీవాగ్దేవి స్కూలులో శుక్రవారం జరిగింది. లయన్స్ అడ్మినిస్ట్రేటివ్ జోన్ చైర్మన్ జంపన సుమన్‌వర్మ, శ్రీవాగ్దేవి స్కూలు డైరెక్టర్ పరసా భరత్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో 6,7,8 తరగతుల విద్యార్థులు పాల్గొని శాంతి అనే అంశంపై చిత్ర లేఖనం ద్వారా తమ ప్రతిభ కనబరిచారు. లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ అనిల్‌కుమార్ జైన్, అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోకవరపు మల్లికార్జున స్వామి, శ్రీవాగ్దేవి లియో క్లబ్ అధ్యక్షురాలు జంపన సౌమ్య పాల్గొన్నారు. విద్యార్థులు తాము గీసిన చిత్రాలను ప్రదర్శించారు.

మత్స్యకారులకు నష్టపరిహారంలో జాప్యం తగదు



మత్స్యకారులకు చెల్లించాల్సిన పరిహారంపై చర్చిస్తున్న ఎమ్మెల్యే అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: ఓఎన్‌జీసీ త్వరగా నష్ట పరిహారాన్ని ఇచ్చేలా సర్వే నివేదికను పూర్తిచేయాలని శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మత్స్యశాఖ అధికారి దడాల గొంతియ్యను ఆదేశించారు. ఆర్ఏఓ మునిస్వామిని వెంటబెట్టుకుని మత్స్యశాఖాధికారి కార్యాలయానికి ఆయన వెళ్లారు. సముద్రంలో ఓఎన్‌జీసీ రెండో గ్యాస్‌పైపులైను వేస్తున్న నేపథ్యంలో చేపలను వేటాడే మత్స్యకారుల జీవనోపాధి పోతున్న నేపథ్యంలో ఆ సంస్థ ఇచ్చిన సొమ్ము మత్స్యకారులకు అందకుండా నిలిపివేస్తున్న దెవరో అందరికీ తెలుసునన్నారు. అనంతరం పుదుచ్చేరి ఫిషరీస్ కార్యదర్శితో ఆయన ఫోన్‌లో మాట్లాడి మత్స్యకారులపై ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సైతం పరిహారం పంపిణీ చేయాలని ఆదేశించారు. వివిధ గ్రామాలకు చెందిన మత్స్యకారులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

త్వరగా నిర్మాణాలు

అల్లవరం: సచివాలయాలు పరిధిలోని సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు, జగనన్న కాలనీల్లో గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ అబ్బిరెడ్డి వెంకటరమణారెడ్డి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన ప్రాధాన్యత భవనాలు, ఇళ్ల నిర్మాణాలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సచివాలయ ఉద్యోగులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ఆడుదాం ఆంధ్ర, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాలను అధికారులు సక్సెస్ చేయాలన్నారు. జేఈ సంపత్, పరిపాలనాధికారి లక్ష్మణరావు పాల్గొన్నారు.

పేదింటి పిల్లలకు కొత్త దుస్తులు, మిఠాయిలు

జిల్లా దిశ డీఎస్పీ మురళీమోహన్, సిబ్బంది వినూత్న కార్యక్రమం



పేదింటి పిల్లల మధ్య జిల్లా దిశ డీఎస్పీ మురళీమోహన్, సిబ్బంది

అమలాపురం టౌన్: దీపావళి పండగ ముందే పేదింటి పిల్లల వద్దకు జిల్లా దిశ డీఎస్పీ సుంకర మురళీమోహన్ తన సిబ్బందితో వెళ్లి వారికి కొత్త దుస్తులు, మిఠాయిలు అందించారు. మండపేట పట్టణ శివార్లలో తాత్కాలిక గుడిసెల్లో జీవించే పేదల కుటుంబాల వద్దకు శుక్రవారం ఆయన స్వయంగా వెళ్లారు. ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆలోచన మేరకు ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పిల్లలతో ముచ్చటించి దీపావళి పండగకు కొత్త దుస్తులు ధరించి ఆనందంగా జరుపుకోవాలని దీవించారు. టపాసుల కాల్చే విషయంలో పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వవద్దని ఆ కుటుంబాలకు డీఎస్పీ అవగాహన కల్పించారు.

కలెక్టర్‌కు వ్యాపారుల మొర

అమలాపురం రూరల్: స్థానిక బాలయోగి స్టేడియంలో బాణసంచా విక్రయించుకునేందుకు అధికారులు రెండు రోజుల పాటు అనుమతి ఇచ్చారని, వ్యాపారుల నుంచి అధికారులు రూ.వేలకు వేలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో వ్యాపారులు కలెక్టర్‌కు వివరించారు. రూ.వేలకు వేలు జీఎస్టీ చెల్లించి దీపావళి సామగ్రి తీసుకువస్తే మళ్లీ జీఎస్టీ చెల్లించమని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శివమ్‌బాత్ పనుల పరిశీలన

యానాం: గౌతమీ గోదావరిని అనుకునిఅతిపెద్ద శివలింగంతో కూడిన శివమ్‌బాత్ పనులను శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన శిథిలమైన ఏనుగు విగ్రహాలను పునఃనిర్మాణం చేశామని, శివమ్‌బాత్ వద్ద కార్తికమాస పుణ్యస్నానాలను వేలాది మంది భక్తులు ఆచరిస్తారని ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యానికి గురికాకుండా పనులు వేగవంతంగా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే శివలింగంను సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా మెట్లను సైతం ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. శివమ్‌బాత్‌ను అనుకుని జీసెస్ స్టాట్యూ వరకు ఉన్న రాజీవ్‌బీచ్ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్ది పర్యాటకులకు ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నాయకులు పండు సిద్ధార్థ, కాకి నాగేశ్వరరావు, పడాల వెంకటేశ్వరరావు, పీడబ్ల్యూడీ ఏఈ కాళ్ల నాగరాజు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెచ్‌సీ మృతి

ముమ్మిడివరం: ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద గార్డుగా విధులు నిర్వహిస్తున్న హెచ్‌సీ టి.బాలరాజు(55) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. కాకినాడ ఏఆర్ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బాలరాజు ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో ఉన్న బాలరాజు శుక్రవారం ఉదయం అస్వస్థతకు గురి కావడంతో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

చీటీల సొమ్ము కేసు పరిష్కరించాలి

యానాం: నియోజకవర్గంలో పదేళ్ల క్రితం జరిగిన రూ.3 కోట్ల చీటీల సొమ్ము మోసం కేసును పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే వెలగా రాజేశ్వరరావు శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధితుల్లో మధ్యతరగతి, పేద వర్గాలకు చెందినవారు ఎక్కువగా ఉన్నారని, కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. ఈ స్కామ్‌పై పూర్తిస్థాయిలో విచారణ చేసి కారకులను గుర్తించాలని కోరారు.

క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా సాల్మన్‌రాజ్

తాళ్లరేవు: మండల క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా దడాల సాల్మన్‌రాజ్ శ్రీనివాసరావు నియమితులయ్యారు. రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి దొమ్మేటి సామ్యూల్ సాగర్ సహకారంతో అంబేడ్కర్ కోనసీమ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు బాబూరావు ఎంపిక చేసినట్లు తెలిపారు. సాల్మన్‌రాజ్‌ను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అభినందించారు.

పీఆర్‌టీసీ సర్వీసులు నడపాలని వినతి

యానాం: నియోజకవర్గ పరిధిలోని దళిత గ్రామాల వెంబడి పుదుచ్చేరి ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (పీఆర్‌టీసీ) బస్సులు నడపాలని, శిథిలమైన ఎస్సీల గృహ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ విడుతలై చిరుతైగల్ కచ్ (వీసీకే) పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పుదుచ్చేరి ఆదిద్రావిడ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. అధ్యక్షుడు తిరుమవలన్, దేవ పూజిలాన్, తలయారీ, మెల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పైపులైన్‌కు శంకుస్థాపన

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ ఇందిరానగర్‌లో తాగునీటి పైపులైన్‌కు శుక్రవారం సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ శంకుస్థాపన చేశారు. మంత్రి పినిపే విశ్వరూప్ సమకూర్చిన జీజీఎంపీ నిధులు రూ.5 లక్షలతో 615 మీటర్ల పొడవున ఈ పైపులైన్ నిర్మించనున్నారు. ఉప సర్పంచ్ దొంగ కనకదుర్గ, పంచాయతీ వార్డు సభ్యులు, ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు ఓగూరి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రహదారులు, డ్రైనేజీకి శంకుస్థాపన

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీలో ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు మోక్షం కలుగనుంది. ఈ పంచాయతీలో సుమారు రూ. 80 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గ్రామ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్ పాల్గొన్నారు.